క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్


ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

మొగల్తూరు: మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎన్ఎస్‌హెచ్ శ్రీనివాస్ సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వి.బాబ్జిరాజును కాకినాడ జిల్లాకు బదిలీ చేశారన్నారు. ఇతని స్థానంలో ఇన్‌చార్జిగా తనను బాధ్యతలు చేపట్టమని జెడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారని శ్రీనివాస్ తెలిపారు. 2023 జూన్ 6న కాకినాడ జిల్లా నుంచి వి.బాబ్జిరాజు బదిలీపై మొగల్తూరుకు వచ్చారని, తిరిగి అదే జిల్లాకు బదిలీపై వెళ్ళారన్నారు.

ఘనంగా అన్నసమారాధన


అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: వినాయక చవితి మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం మొగల్తూరులో ఆటో సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో వినాయకుడికి ఆటో యూనియన్ల వారు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి, చవితి ఉత్సవాలు నిర్వహించారు. స్నేహ ఆటోయూనియన్, సాయి సిద్ది వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కడిమి రామకృష్ణ, సుందర గణేష్, రమేష్, కె.తాతాజీ, బెండమూరి లంక నాగరాజు, బత్తుల భీముడు, కడలి సత్యనారాయణ, నాగమల్‌సింగ్, మురాల బాలు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్స్ రూ.15 లక్షల విరాళం

పాలకొల్లు సెంట్రల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి పశ్చిమగోదావరి జిల్లా భారతీయ విద్యాభవన్స్ సంస్థల నుంచి రూ.15 లక్షలు విరాళం అందజేసినట్లు విద్యా సంస్థల చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబునాయుడికి భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులచే రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో భూపతిరాజు అచ్యుతరామరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర ఆలయ ఈవోగా ముచ్చర్ల


ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ కార్య నిర్వహణాధికారిగా ముచ్చర్ల శ్రీనివాసరావు పూర్తి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకు ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తనకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయవాడ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం

కాళ్ల: కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులపై మోకాళ్లలోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచిపోయింది. అసలే అధ్వానంగా ఉన్న కోలనపల్లి - ఆకివీడు రహదారి వర్షంతో అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన

భీమవరం: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, ఏఐటీయూసీ నాయకుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ కార్మికులు తమ పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్పు చేసి, కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా తమ సొంత ఎజెండాతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, గోపాలకృష్ణంరాజు, వరలక్ష్మి, పెద్ద కనకరాజు, రాంబాబు, కలిశెట్టి శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై మండిపడ్డ దళిత సంఘాలు
- సంఘ నేతల గృహ నిర్బంధం


పాలకొల్లు అర్బన్: జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు


నరసాపురం: రఘురామకృష్ణరాజుపై ఫిర్యాదు అందిస్తున్న నాయకులు

పాలకొల్లు అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడమే కాకుండా, కుల మతాల మధ్య చిచ్చు రేపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పలువురు ఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేశారు. భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్నను అంబేడ్కర్‌కు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యున్నతమైన వ్యక్తిగా, ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ ఫ్లెక్సీలను చించడం దారుణమన్నారు. ఎమ్మెల్యేగా రఘురామకృష్ణరాజు అనర్హుడని వారు మండిపడ్డారు. తక్షణం అతని ఎమ్మెల్యే పదవిని రద్దు చేయాలని కోరారు. ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ చీఫ్ అడ్వైజర్ కేసీ రాజు, నేలపాటి భాస్కరరావు, పాలపేటి జోనా, కటికతల రేజెండ్ల, కె.శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు కట్టాలి

నరసాపురం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని నరసాపురం మాలల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మాలల ఐక్యవేదిక నియోజకవర్గ నాయకులు ఆకిలేటి ఆనంద్, గాది రవి, పిల్లి నవరత్నం, కాటం చంటి, వర్ధనపు సుధాకర్, తదితరులు నరసాపురం రూరల్ సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేశారు. అనంతరం నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణను కలిసి వినతి పత్రం అందించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎమ్మెల్యేగా గౌరవం పొందిన వ్యక్తి రాజ్యాంగ నిర్మాతనే అవమానించడం దారుణమన్నారు. రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకునే వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

పెనుగొండ: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దుశ్చర్యలకు నిరశనగా చేపట్టిన ఉద్యమాన్ని అరెస్టులతో ఆపలేరని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ హెచ్చరించారు. ఏలూరుపాడులో నిరసన వ్యక్తం చేయడానికి వెళుతుండగా పాలకొల్లులో పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని, ఆచంట వేమవరంలోని మాల మహానాడు కార్యాలయం వద్ద హౌస్ అరెస్ట్ చేశారు. ఏలూరుపాడులో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్వయంగా అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి, యావత్తు దళిత జాతిని అగౌరవ పరిస్తే అట్రాసీటి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం మానేసి, నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఒక ప్రజా ప్రతినిధి ఇలాంటి దారుణానికి పూనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాలు ఐక్యంగా రఘురామకృష్ణరాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యే వరకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నల్లి రాజేష్ గృహ నిర్బంధం

పాలకొల్లు అర్బన్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఉన్మాద చర్యలను నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిని పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. పట్టణ సీఐ కె.రజనీ కుమార్, పోలీసులు హౌసింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న రాజేష్ గృహానికి చేరుకుని ఆయనను గృహ నిర్బంధం చేశారు. అప్పటికే పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. నల్లి రాజేష్, తదితరులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. పోలీసులు వారిని భీమవరం వెళ్లకుండా అడ్డుకున్నారు. కొంతసేపు ఇంటి వద్ద టెంట్ వేసుకొని నిరసన తెలిపారు. రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి అంబేడ్కర్ ఫ్లెక్సీ చించడం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు లాంటి వ్యక్తికి తగదన్నారు. చదువుకోలేని మూర్ఖుడిగా ప్రవర్తించిన ఎమ్మెల్యే వ్యవహారంపై గవర్నర్ జోక్యం చేసుకుని, అతని ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో పార్లమెంట్, అసెంబ్లీకి పోటీ చేయకుండా రఘురామకృష్ణరాజును అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, రాష్ట్ర కార్యదర్శులు కర్ణి జోగయ్య, విప్పర్తి ప్రభాకరరావు, నాయకులు మోకా నరసింహరావు, సరెళ్ల శ్రీనివాస్, నల్లి జయరాజు, ఏనుగుపల్లి చంద్రశేఖర్, నల్లి సంజీవరావు, తండా ఇస్సాక్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

దళితనేత కాకిలేటి మధు గృహ నిర్బంధం


కాకిలేటి మధును గృహనిర్బంధం చేసిన దృశ్యం

నరసాపురం రూరల్: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ ఆయన ఇంటి ముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ ఆ సంఘ నాయకులను గృహ నిర్బంధం చేశారు. మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు, నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనందకుమార్ (మధు)ను సోమవారం ఉదయం నరసాపురం మండలంలోని చిట్టవరం గ్రామంలోని ఆయన నివాసం వద్ద గృహ నిర్బంధం చేశారు. దళిత వ్యతిరేకి అయిన రఘురామకృష్ణరాజుకు త్వరలోనే దళిత సంఘాలు తగిన గుణపాఠం చెబుతాయని మధు పేర్కొన్నారు.

టెలీ కాలింగ్‌లో ఉచిత హోమియో వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న హోమియోపతి హాస్పిటల్ సిబ్బంది

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు) టెలీ కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది జున్నూరు నాన్నగారి ఆశ్రమం వద్ద సోమవారం హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఫోన్‌లో వారి ఆరోగ్య ఇబ్బందులను డాక్టర్‌కు చెప్పించారు. డాక్టర్ టెలీకాలింగ్ ద్వారా 76 మంది రోగుల వ్యాధులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం డాక్టర్ సిఫారసు మేరకు రోగులకు ఉచితంగా హోమియో పిల్స్ అందజేశారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవో అచ్యుత్ అంబరీష్


ఆర్డీవోకు సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

నరసాపురం: అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధికారులకు సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్‌కు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 52 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. గత మూడు వారాలుగా కార్యక్రమం జరగకపోవడంతో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందించారు. భూ సర్వేలు, రేషన్‌కార్డులు, మంచినీటి సమస్యలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

పాలకొల్లు అర్బన్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆర్డీవో అంబరీష్ అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహిస్తున్న కంచర్ల వీర్రాజు మెమోరియల్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు, అలాగే బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో పెరల్ జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తటవర్తి కృష్ణమూర్తి, అడిషనల్ చైర్మన్ కలిదిండి రామరాజు, కోశాధికారి రేపాక ప్రవీణ్‌ఖాను, చీఫ్ డోనర్లు భూపతిరాజు విశ్వనాథరాజు, కంచర్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి


పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో

మొగల్తూరు: అధిక వర్షాల కారణంగా తెగుళ్ళు ఆశించే అవకాశం ఉన్నందున సస్య రక్షణ చర్యలు చేపడితే వాటిని నివారించొచ్చని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సోమవారం మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం-2 సచివాలయ పరిధిలోని వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి పంటపై పాము పొడ తెగులు వ్యాపిస్తే హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు, వాలిడా మైసిన్ 1 మిల్లీ లీటర్, ప్రొపికోనజోల్ 0.4 మిల్లీ లీటర్ మందును లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని మూడు బొమ్మలు సెంటర్ ప్రాంతానికి చెందిన ఉంగరాల సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై జయలక్ష్మి చెప్పారు. ఆదివారం రాత్రి సత్యనారాయణ మొగల్తూరు రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో గాయపడ్డ సత్యనారాయణను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. సత్యనారాయణ కుమారుడు మాధవ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆటో నెంబర్ ఆధారంగా డ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

మురుగు నీటి నిల్వలను తొలగించాలి


పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మొగల్తూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడటంతో పాటు మురుగు నీరు నిలిచిపోకుండా వాటి నిల్వలను తొలగించుకోవాలని ఈవో పీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మొగల్తూరులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ వీఎస్‌వీఆర్ కిశోర్, ఏఎన్ఎంలు, సచివాలయ కార్యదర్శులు సుబ్బారావు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్య సమాజానికి వెలుగు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

పాలకొల్లు అర్బన్: స్త్రీ చదువుకుంటే సమాజానికి వెలుగునిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ఆడపిల్లను చదవనిద్దాం ఆడపిల్లను ఎదగనిద్దాం అంటూ బాలికల విద్య ప్రాధాన్యతను వివరించారు. ఆడపిల్లలు పోషకాహారం తీసుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి, సచివాలయ కార్యదర్శి కె.రాజేష్ కుమార్, జి.జనార్ధనరావు, బి.జయశ్రీ, మహిళా పోలీసులు జి.లావణ్య, కె.ప్రసన్న, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పి.మార్తమ్మ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటిషన్



సమావేశంలో మాట్లాడుతున్న సోడదాసి శ్రీధర్, తదితరులు

నరసాపురం: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ నరసాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాలల న్యాయ పోరాట సమితి నరసాపురం నియోజక వర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం శ్రీధర్ పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది భరత్ మనుబర్వాల ద్వారా ఈ పిటీషన్ సుప్రీంకోర్టులో దాఖలు చేశామని చెప్పారు. మాలల హక్కులకు న్యాయం జరిగే వరకూ న్యాయ పోరాటం సాగిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘ నేతలు మట్టా సుధీర్‌మోహన్, వర్ధనపు ఏసురత్నం, మేడిది శ్రీమంత్, సోడదాసి రత్నరాజు పాల్గొన్నారు.

రత్నమాలకు బెస్ట్ సర్వీసు అవార్డు


దుబాయ్‌లో అవార్డు అందుకుంటున్న కొత్త కనక రత్నమాల

పెనుగొండ: దుబాయ్‌లో జరిగిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో 2024 సంవత్సరానికి గాను ఆచంట మండలం భీమలాపురం గ్రామానికి చెందిన కొత్త కనకరత్నమాల బెస్ట్ సర్వీసు అవార్డును అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆచంటలో వివరాలను అందించారు. యూఏఈలో గ్లోబల్ అధ్యక్షుడు రామకృష్ణ, గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్, అడ్రైజరీ కమిటీ చైర్మన్ టి.రాజశేఖర్, అబుదాబి అధ్యక్షుడు సురేష్ రమా రామకృష్ణ, టి.జయశ్రీ రాజశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వివరించారు. ఏపీ మహిళా విభాగం సీనియర్ సిటిజన్ విభాగం అధ్యక్షురాలిగా చేసిన సేవలకు అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

కలెక్టరేట్‌కు తరలి రావాలి

పెనుగొండ: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించడానికి చేనేత కార్మికులు తరలి రావాలని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కర్ రావు ఓ ప్రకటనలో కోరారు. చేనేత కార్మికులకు కూలీలు పెంచాలని, నేతన్న నేస్తం రూ.24 వేలు బ్యాంకు అకౌంట్‌లో వెంటనే జమ చేయాలని, పట్టు రాయితీపై అందించాలని, చేనేత సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ప్రతీ నియోజక వర్గంలోనూ నేత బజార్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'మీకోసం'కు 2 ఫిర్యాదులు

ఆకివీడు: మీకోసం కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కె.వాణి సోమవారం తెలిపారు. స్థానిక 10వ వార్డులోని శారదా కాన్వెంట్ వీధిలో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని ఆ ప్రాంతానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కె.రామలింగరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక స్టార్ ఆఫ్ హోప్ ఆసుపత్రి ముందు ఆక్రమణల్ని తొలగించాలని, జాతీయరహదారికి చేర్చి ఉన్న ఆక్రమణల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆసుపత్రి ప్రతినిధి డేవిడ్ లివింగ్‌స్టన్ ఫిర్యాదు చేశారు.

28న గుర్రం జాషువా జయంతి సభ

నరసాపురం: ఈ నెల 28 పట్టణంలోని శ్రీసూర్య కళాశాలలో గుర్రం జాషువా 50వ సాహిత్య సభ నిర్వహిస్తున్నట్లు నరసాపురం గుర్రం జాషువా జయంతి సమితి అధ్యక్షుడు జీవీకే రామారావు, కార్యదర్శి పీఎస్ త్రినాథ్ తెలిపారు. సీనీ కవి రసరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. తెలుగు పండితురాలు టి.కృష్ణవేణికి సన్మానం ఉంటుందని వివరించారు.

జిల్లా జట్లకు ఎస్వీకేపీ విద్యార్థుల ఎంపిక

పెనుగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండర్-19 విభాగంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ భీమవరం, ఏలూరు, పెదవేగిల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, పీడీ బి.దుర్గారావు, కడలి వెంకట రమణమూర్తి, ఎం. సుగుణాకర్ అభినందించారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది


వ్యవసాయాధికారి చిందులూరి దేవి

యలమంచిలి: మండలంలోని 32 గ్రామాల్లో ఈ నెల 24 నుంచి డిసెంబర్ చివరి వరకు ప్రతీ మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధికారులతో కలిసి రైతులకు మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గుంపర్రు, మధ్యాహ్నం దొడ్డిపట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. అదే విధంగా మంగళవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు పొలం గట్ల వెంబడి తిరిగి ఎలుకల బొరియలు గుర్తించి, ఆ బొరియలను మట్టితో కప్పాలన్నారు. మరుసటి రోజు ఏ బొరియలు తెరచి ఉన్నాయో గుర్తించి వాటి వద్ద ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బ్రోమడయోలిన్ పొట్లాలను ఉంచాలని ఆమె కోరారు. ఈ రెండు కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవి కోరారు.

ఘనంగా స్వచ్ఛతా హీ సేవ


పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి పెద్దిరాజు

పెనుగొండ: స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాన్ని సోమవారం వడలిలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వలపన నరేష్, పంచాయతీ సభ్యులు మేకా శివయ్య, ఉప్పలపాటి చంటి, గ్రామ కార్యదర్శి పీఏ రామకృష్ణ పాల్గొన్నారు.